# దండారికి వేళాయే..

● రేపటి నుంచి ఊరూరా వేడుకలు ● నేడు ఝరి గ్రామంలో భోగి పండుగ ● ఆటాపాటలతో మార్మోగనున్న గూడేలు
● గుస్సాడీ నృత్యాలు.. హాస్య నాటికలతో వినోదం ● దేవతలకు సంప్రదాయ పూజలు ● అతిథులకు ఆహ్వానం.. విందు



రేలా..రేలా పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న మహిళలు(ఫైల్)

కెరమెరి, నవంబర్ 4 : దండారి.. అంటేనే ఆదివాసీ గూడేల్లో వినోదాల వేడుక. యేటా ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత 'ఏత్మాసార్ పేన్' పేరిట చేసే ప్రత్యేక పండుగ నేటితో ప్రారంభం కానున్నది. ఝరి గ్రామంలో సంప్రదాయబద్ధంగా భోగి పండుగ జరుపుకోనున్నారు. డప్పుల దరువు, గజ్జెల మోతలు.. గుస్సాడీల నృత్యాలతో గూడేలన్నీ మారుమోగనున్నాయి. ఓ వైపు కోలాటాలు, మరోవైపు గోండిపాటల నృత్యాలు, హాస్యనాటికల ప్రదర్శనలతో ఈ వేడుక సాగనున్నది. దీపావళికి ముందు భోగి పండుగతో ప్రారంభం కానున్న ఈ వేడుక కొలబొడితో ముగిస్తుంది. అత్యంత సంప్రదాయంగా కొనసాగే దండారి వేడుక ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆశ్వీయుజ పౌర్ణమి అనంతరం ప్రారంభమయ్యే అద్భుతమైన ఆదివాసీల ముఖ్యమైన పండుగ. దండారి సంబురాలను చూసేందుకు పల్లె ప్రజలతో పాటు పట్టణవాసులు సైతం ఆసక్తి చూపిస్తారు. దాదాపు వారం, పది రోజుల పాటు జరుపుకునే దండారి పండుగను గూడేల్లో వైభవంగా నిర్వహించేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రత్యేక పండుగగా గుర్తించింది. యేటా దండారి ఉత్సవాలకు రూ. కోటి విడుదల చేసి ఒక్కో దండారి బృందానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయమందిస్తున్నది.

### దండారీలో రకాలు..

దండారిలో ఆరాధ్య దేవత పద్మల్‌పురికాకో ప్రధానమైనది. ఇందులో ఏత్మాసార్ పేన్ పేరిట నాల్గు సగ(గోత్రం)లలో ఉత్సవాలు జరుపుకుంటారు. నాల్గు సగలవారు గుమ్మెల, 5 సగల వారు ఫర్ర, 6 సగల వారు కోడల్, 7 సగల వారు తపల్ పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా కోలాట, మహిళల బృందాలు వేర్వేరుగా ఉంటాయి. ఈ వేడుకల్లో భేటికోలా, మాన్‌కోలా, సదర్‌కోలా, కోడల్‌కోలా, సార్‌కోలా, కలివల్‌కోలావంటి అనేక రకాలుగా నృత్యాలు చేయడం ఆదివాసీలకే సొంతం.

### గుస్సాడీల దీక్ష మరింత కఠోరం..

దండారి వేడుకల్లో గుస్సాడీల పాత్ర కీలకమైంది. నెమలి పింఛంతో చేసిన టోపీలు, టోపికి ముందు రెండు పశువుల కొమ్ములు, మధ్యలో ఓ అద్దం, చుట్టూ అలంకరణ వస్తువులు, భుజానికి వన్యప్రాణుల తోలు, నడుము, కాళ్లకు గజ్జెలు, మెడలో రుద్రాక్షమాల వేసిన ఆదివాసీ దేవుని ప్రతిరూపమే గుస్సాడీలు. గోండి భాషలో వారిని గుస్సాడీకి బదులు 'గురు' అని పిలుస్తారు. భోగి పండుగతో మాలధారణ వేసిన్నప్పటి నుంచి వారు దీక్షలో కొనసాగుతారు. దీక్ష చేపట్టిన నాటి నుంచి పూర్తయ్యే వరకు స్నానాలు ఆచారించకుండా, చలిలోనూ పాదరక్షలు, అర్ధ దుస్తులు ధరించి, మంచం, కుర్చీలు, సోపాలో కాకుండా నేల పైనే కూర్చోవడం, నిద్రించడం వారి ఆచారం.

### దండారిలో మరో పాత్ర పోరీలు..

దండారి ఉత్సవంలో పాల్గొనే గుస్సాడీల తర్వాత మరో కీలక పాత్ర పోరీలది(ఆడ వేషధారణలో ఉండే యువకులు). వీరు కూడా గుస్సాడీలతో చివరి రోజైన కొలబొడి వరకు దీక్షలో కొనసాగుతారు. ఏ ఊరికి వెళ్లిన, ఏ ఇంటిని సందర్శించిన ఈ పోరీలు మంగళహారతులతో అష్ట, ఐశ్వర్యాలు కలగాలని, కుటుంబ సభ్యులందరికీ సుఖశాంతులు కలగాలనీ దీవిస్తారు.

### దర్శనం.. అదో వినోదం..

ఓ గ్రామానికి చెందిన దండారి బృందం మరో గ్రామానికి బయలు దేరి వెళ్లడం.. అదో వినోదపు కార్యక్రమం. గుస్సాడీ బృందం ఏ గ్రామానికి వెళ్లాలన్నా రాత్రి పూట వెళ్లడం ఆచారం. రాత్రంత నృత్యాలు, గోండి పాటలపై డ్యాన్సులు, హాస్యపు నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తారు. ఇక ఉదయం మాన్‌కోలాతో నృత్య ప్రదర్శనలు మొదలై సార్‌కోలాతో ముగిస్తారు. ఈ సందర్భంగా వచ్చిన అథితులకు ఘన స్వాగతం పలికిన అనంతరం మరుసటి రోజున ప్రత్యేక విందును ఏర్పాటు చేసి వీడ్కోలు పలుకుతారు. దీంతో ఇరువువైపులా స్నేహభావం పెంపొందడంతో పాటు సంస్కృతీ సంప్రదాయల పరిరక్షణకు తోడ్పడుతుంది.

### కొలబొడితో వేడుకలు ముగింపు

ఎంతో వైభవంగా ఉత్సవాలు జరుపుకున్న తర్వాత కొలబొడితో వేడుకలు ముగిస్తారు. తమ కార్యక్రమాలు, అతిథుల రాకపోకలు పూర్తి కాగానే గ్రామంలోని దండారి బృందం ఇంటింటికీ వెళ్లి దర్శనం ఇస్తారు. దీంతో ఇంటి గృహిణి ఓ పల్లెంలో ధాన్యాలు, తోచిన నగదు ఉంచిన హారతిని వారికి అందిస్తారు. దానిని వారు సంతోషంగా స్వీకరించి ఇంట్లో అందరూ బాగుండాలని, పాడిపంటలు సమృద్ధిగా పెంపొందాలని పాటలు పాడుతూ హారతి పూజ ఇస్తారు. ఇలా అన్ని ఇండ్లు పూర్తి కాగానే.. కొలబొడి నిర్వహించి కార్యక్రమాన్ని ముగిస్తారు.



కోలాట నృత్యం చేస్తున్న దండారి బృందం(ఫైల్)



గోండి పాటపై ఆడ వేషధారణలో నృత్యం చేస్తున్న ఆదివాసులు(ఫైల్)

# జయహో.. నాయకా..

## గులాబీ శ్రేణుల్లో జోష్ నింపిన సీఎం కేసీఆర్ సభలు

● ఆలోచింపజేసిన గులాబీ దళపతి ప్రసంగం
● బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఉక్కిరిబిక్కిరి
● రెట్టించిన ఉత్సాహంతో దూసుకుపోతున్న అభ్యర్థులు



నిర్మల్ సభకు తరలివచ్చిన జనసందోహం (ఫైల్)

నిర్మల్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సభలు సూపర్ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. సీఎం పాల్గొన్న 'ప్రజా ఆశీర్వాద సభ'లకు భారీగా జనం తరలిరావడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తోంది. రెండు రోజులపాటు సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించడంతో ఊరూరా కారు దూకుడు పెరిగిందని గులాబీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి సభల తర్వాత కాంగ్రెస్, బీజేపీల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు గులాబీ గూటికి చేరుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు ఉధృతం కావడంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో కలవరం కనిపిస్తోంది. నిర్మల్‌లో జరిగిన సభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని సీఎం కేసీఆర్ వివరిస్తూనే.. మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించడంతో ప్రజల్లో మంచి స్పందన వస్తోంది. నిర్మల్ జిల్లా ఏర్పాటుతోపాటు, మెడికల్ కాలేజీ సాధించడంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృషి ఎంతో ఉన్నదని సీఎం కేసీఆర్ నిర్మల్ సభలో ప్రస్తావించి ప్రజలను ఆలోచింపజేశారు. జేఎన్‌టీయూకూ అనుబంధంగా నిర్మల్‌లో ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ.. యువతను బీఆర్‌ఎస్ వైపు మళ్లేలా చేసిందంటున్నారు. అల్లోలను గెలిపిస్తే నిర్మల్ మున్సిపాలిటీతోపాటు, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని సీఎం స్పష్టం చేయడంతో అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టేందుకు మొగ్గు చూపుతున్నారు.

### ఆలోచింపజేసిన సీఎం ప్రసంగం

భైంసాలో జరిగిన సభలో తరచుగా మత ఘర్షణలను ప్రస్తావిస్తూ కులాలు, మతాలకు అతీతంగా అభివృద్ధి కావాలా? లేక రెండు రోజులకోసారి జరిగే లేనిపోని గొడవలు, రక్తపాతాలు కావాలా.. అంటూ సీఎం ప్రశ్నించడం ముథోల్ నియోజకవర్గ ప్రజలను ఆలోచింపజేసింది. అలాగే ఇక్కడి ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసల సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇవ్వడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటి సమస్య లేకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. దగాకోరు మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకులను విశ్వసిస్తే అభివృద్ధిలో అట్టడుగుకు వెళ్తామని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఆయా సభల ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు.



నిర్మల్ సభలో మంత్రి ఐకేరెడ్డి సతీమణి విజయలక్ష్మి, కోడలు దివ్యారెడ్డి (ఫైల్)

పొరపాటున కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రైతుబంధు, కరెంటు, పింఛన్లు ఆగిపోతాయని ముఖ్యమంత్రి తన ప్రసంగాల్లో చెప్పడంతో అన్ని వర్గాల ప్రజలు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో అంతంత మాత్రంగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లకు సీఎం కేసీఆర్ పర్యటనలు సూపర్ సక్సెస్ కావడంతో ఆయా పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. మరోవైపు గులాబీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ముథోల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి చేరిక బీఆర్‌ఎస్‌లో జోష్ నింపింది. మొత్తానికి రెండు రోజుల్లో రెండు నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్న సభలు సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్‌లో పండుగ వాతావరణం నెలకొన్నది.



భైంసా ప్రజాఆశీర్వాద సభలో నృత్యం చేస్తున్న లంబాడా మహిళ

# అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి

● బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ● నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలన



బందోబస్తును పరిశీలిస్తున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి, నవంబర్ 4 : నామినేషన్ వేసేందుకు వచ్చే ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పకుండా పాటించాలని ఏసీపీ సదయ్య సూచించారు. తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును శనివారం ఏసీపీ పరిశీలించారు. బందోబస్తు సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. కేంద్రం నుంచి 100 మీటర్ల లోపు ఎలాంటి ర్యాలీలు, వాహనాలకు అనుమతి లేదని తెలిపారు. పాత బస్టాండ్ నుంచి వచ్చే వాహనాలను ఆర్డీవో కార్యాలయం ముందు నుంచి మళ్లించినట్లు వెల్లడించారు. పాత్రికేయులకు ప్రత్యేకంగా ఏఎంసీ పార్కులో మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ ఉన్నారు.

# బెల్లంపల్లి ఆర్డీవో సురేశ్ బదిలీ

బెల్లంపల్లి, నవంబర్ 4: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్డీవో కాశబోయిన సురేశ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయా శాఖ ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఆర్డీవోగా బదిలీ చేస్తూ సీసీఎల్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న హరికృష్ణ ఇక్కడికి బదిలీపై రానున్నారు. హరికృష్ణ నెన్నెల తహసీల్దార్‌గా పనిచేశారు. హరికృష్ణ బెల్లంపల్లి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# వేల కోట్లున్నోళ్లా..? వేల కోట్లు తెచ్చినోళ్లా..?

## ఎవరు కావాలో ప్రజలే నిర్ణయించాలి

● నియోజకవర్గంలో చేపట్టిన ప్రగతి మీ కళ్ల ముందే ఉంది ● బెల్లంపల్లిని అన్న, చెన్నూర్‌ను తమ్ముడు, పెద్దపల్లిని కొడుకు గుత్త పట్టుకున్నరు
● నాయకులను అర్రస్ పాడే విష సంస్కృతి మంచిది కానే కాదు ● ఇగ దళితులెవ్వరూ రాజకీయం చేయొద్దా..
● పైసలు పెట్టి ప్రజలను కొనగలరా ● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి చెత్త రాజకీయం ఎప్పుడైనా ఉందా
● అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌నే గెలిపించాలి
● ప్రభుత్వ విప్, చెన్నూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, చిత్రంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, బీఆర్‌ఎస్ నాయకులు

మంచిర్యాల, నవంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎప్పుడూ లేని చెత్త రాజకీయం.. థర్డ్ క్లాస్ రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ విప్, చెన్నూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. మంచోళ్లైన జిల్లా ప్రజలను గడ్డం బ్రదర్స్(గడ్డం వినోద్, వివేక్) కలుషితం చేస్తున్నారంటూ మండిపడ్డారు. శనివారం క్యాతన్‌పల్లిలోని తన ఇంటిలో చెన్నూర్ ప్రగతి ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేల కోట్ల ఆస్తులున్న వారు కావాలో.. నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్లు తీసుకొచ్చిన నేను కావాలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. చేసిన అభివృద్ధి, అమలు చేయబోయే మ్యానిఫెస్టోను చూపించి ఓట్లు అడిగే దమ్ములేక.. నాయకులకు ప్యాకేజీలు ఇస్తూ, మొత్తం అర్రస్ పాటపాడినట్లే పాడి కొంటున్నట్లు సోషల్ మీడియాలో వస్తుందన్నారు. వాళ్లకు వేలకోట్ల ఆస్తులున్నయ్ ఇవ్వ గలుగుతారని, కానీ నేను ఇవ్వలేనన్నారు. కేసీఆర్ శిష్యుడిగా నేను సీఎం, మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగి వేల కోట్ల నిధులు తీసుకురాగలనుకానీ.. నాయకులకు కోట్లు ఇచ్చుడు నాతోని కాదు. అంతిమంగా నేను ప్రజలను కోరుతున్నానని, ప్రజాక్షేత్రంలో, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలని, వేల కోట్ల ఆస్తులున్న ఆయన కావాలా.. వేల కోట్ల నిధులు తెచ్చిన నేను కావాలా.. ప్ర జలే తేల్చాలన్నారు. డబ్బు రాజకీయాలు, కార్పొరేట్ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. నిలకడ, నిబద్ధత, నీతీ నిజాయితీ లేనోళ్లు ఎన్ని పార్టీలైనా మారుతారన్నారు. ఒక్క టికెట్ కోసం కాంగ్రెస్‌కు రూ.100 కోట్లు ఇచ్చినట్లు సోషల్‌మీడియాలో నేను కూడా చూశానన్నారు. ఎక్కడికి పోతున్నయ్ రాజకీయాలు.. ఏమైతుంది ప్రజాస్వామ్యం ఆలోచించాలన్నారు.

### నేను.. చిన్నయ్య ప్రాణం పెట్టి పనిచేసినోళ్లం..

గతంలో వాళ్లు ఈ ప్రాంతం నుంచి ప్రాతినిథ్యం వహించారని, సుమారు 35 ఏండ్లు వాళ్లు ఈ ఏరియాలోనే ఉన్నారన్నారు. వాళ్ల హయాంలో ఎన్ని ఎకరాలకు నీళ్లు తెచ్చారో చెప్పి ఓట్లు అడగాలన్నారు. నేను ఇవాళ రూ.1658 కోట్లతో చెన్నూర్‌లో లక్ష ఎకరాలకు నీళ్లు తెచ్చే కార్యక్రమాన్ని మొదలుపెట్టానన్నారు. రూ.500 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ నేను పెట్టిస్తున్నానని, వాళ్లకు కూడా ఎన్నో సంస్థలు ఉన్నాయని, మరి ఒక్క ఫ్యాక్టరీ అన్న చెన్నూర్‌లో ఎందుకు పెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇక్కడ మన పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వాళ్ల ఫ్యాక్టరీలు ఇక్కడ పెట్టరు కానీ, వాళ్లకు ఉద్యోగం కావడం కోసం వచ్చి ఇక్కడ పోటీ చేస్తారా అంటూ నిలదీశారు. ప్రాణం పెట్టి, చెమట కష్టం పెట్టి, రక్తం పెట్టి నియోజకవర్గాల కోసం అటు దుర్గం చిన్నయ్య, ఇటు నేను కష్టకాలంలో పని చేశామన్నారు. కరోనా, ఆర్థిక మాధ్యంలోనూ నియోజకవర్గాల కోసం తల్లాడిల్లినోళ్లం అని చెప్పుకొచ్చారు. మా నాన్న యశోద ఆసుపత్రిలో వెంటిలేటర్ మీద ఉంటే.. నేను వచ్చి కలెక్టర్ దగ్గర మీటింగ్ పెట్టి వడ్లు కొనేట్లు చేశానని, ఎన్నడన్న వాళ్లు ఇలాంటి పనులు చేశారేమో ఆలోచించాలన్నారు. వందల మంది ప్రాణాలను బలితీసుకున్న తుంతుంగ వాగు, సుద్దాల వాగు, కిష్టంపేట పెద్దమోరీ, బొక్కలగుట్ట వాగులపై మేము బ్రిడ్జిలు కట్టామని, మరి మీ హయాంలో ఎందుకు కట్టలేదో చెప్పాలన్నారు. ఇప్పుడు మీరు ప్రచారానికి పోతే మేం కట్టిన బ్రిడ్జిల మీది నుంచే పోవాలన్నారు.

### పైసలున్నోళ్లే పోటీ చేయాలా..

ఇటు చెన్నూర్, అటు బెల్లంపల్లిని ఇద్దరు అన్నదమ్ములు పంచుకున్నారని, ఇగ మిగిలిన దళితులు..వేరే వాళ్లు రాజకీయాల్లో ఉండొద్దా అని ప్రశ్నించారు. బెల్లంపల్లిలో అన్న, చెన్నూర్‌లో తమ్ముడు, పెద్దపల్లిలో కొడుకు గుత్త పట్టుకున్నారని.. దళితులందరూ ఆలోచన చేయాలన్నారు. ఈ ఏరియా ఏమైనా వాళ్ల గుత్త ఆధిపత్యమా.. ఎటు పోతుంది... ఏమైతుంది... వేరే వాళ్లు ఉండవద్దా.. వేరే నాయకత్వాలు వద్దా.. వీళ్ల తాతలు, తండ్రులు, కొడుకులు మూడు తరాలు వీళ్లే ఉండాలా.. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. పైసలు ఉన్నోడే పోటీ చేయాలా.. వేరే వాడు చేయొద్దా... పైసలతోనే ఓట్లా.. పైసలతోనే రాజకీయాలా.. ఎంత మందిని కొంటారు పైసలు పెట్టి, ప్రజలందరినీ కొనగలారా అంటూ మండిపడ్డారు. ఒక్కరు చేరితే ఐదు లక్షలు, పది లక్షలు, పదిహేను లక్షలు, ఆ ఒక్కరూ ఇంకొకరిని తెస్తే ఇంకో పది లక్షలు, ఇంకో ఐదు ఎక్స్ట్రా.. ఇదేం సంస్కృతో చెప్పాలన్నారు. ఇలాంటి రాజకీయాలు చాలా బాధాకరమని, ఝుహుత్సాహకరమన్నారు. మీ పార్టీకి ఉన్న మ్యానిఫెస్టో చూపించి, గతంలో చేసిన పని చూపించి ఓట్లు అడగాలి కదా.. ప్యాకేజీలు ఇచ్చుడేందంటూ ప్రశ్నించారు. ఈ విషయంపై తగిన ఆధారాలు బయటికి తీస్తామని, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కొనుగోలు ప్రజల రియాక్షన్ ఎలా ఉంటుంతో చూడాలన్నారు. అన్ని గమనిస్తున్న జనం తగిన సమయంలో తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమకు ప్రజల మీద పూర్తి విశ్వాసం ఉందని, ప్రజలనే నమ్ముతున్నామన్నారు. ప్రజలను అభ్యర్థిస్తున్నామే తప్పితే ప్యాకేజీలు ఇచ్చుడు, కొనుడు, అమ్ముడు రాజకీయాలు చేయడం లేదన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### అద్భుతం.. చెన్నూర్ ప్రగతి ప్రస్తానం..

చెన్నూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక, గడిచిన కొనేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన చెన్నూర్ ప్రగతి ప్రస్తానం పుస్తకాన్ని ఎంపీ వెంకటేశ్‌నేతతో కలిసి బాల్క సుమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలకు ఎన్ని నిధులు ఇచ్చినం, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ కింద ఎన్ని బ్రిడ్జిలు కట్టినం, రూ.1658 కోట్లతో నిర్మించనున్న చెన్నూర్ ఎత్తిపోతల పథకం,రూ.500 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు, మొదటి దశలో 'మన ఊరు మన బడి' కార్యక్రమం బాగు చేసుకున్న స్కూళ్లు, విద్య, వైద్యం, ఆరోగ్యం, నీటి పారుదల, గ్రామీణాభివృద్ధి ఇలా ప్రతి అంశాన్ని కవర్ చేస్తూ పుస్తకాన్ని అద్భుతంగా రూపొందించామన్నారు. దీన్ని చెన్నూర్ ప్రజానికానికి, మేధావులకు, అడ్వకేట్‌లకు, టీచర్లకు, డాక్టర్లకు విజ్ఞులైన ప్రతి ఒక్కరి పంపిస్తామన్నారు. గత పాలకులు, నాయకుల హయాంలో ఏం జరిగింది నియోజకవర్గంలో.. ఇప్పుడు ఏం జరిగిందనేది ప్రజల కండ్ల ముందు ఈ డ్యాకుమెంట్ ద్వారా చూపెడుతున్నామన్నారు. గతంలో ఇక్కడి నుంచి గెలిచి కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పని చేసిన వారి హయాంలో జరగనంత అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు ఇవాళ సీఎం కేసీఆర్ నాయకత్వలో చెన్నూర్‌లో జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే చాలా చేశామని, ఇంకా చాలా చేస్తామని చెప్పారు. ఈ అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే, ఈ సంక్షేమ రాజ్యం ఇలాగే ఉండాలంటే చెన్నూర్‌లో మరోసారి కేసీఆర్ నాయకత్వమే ఉండాలని, గులాబీ జెండానే ఎగరాలన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను, ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకోసం నిరంతరం కష్టపడుతున్న మీ ఇంటి బిడ్డ బాల్క సుమన్‌ను గెలిపించాలని ఎంపీ వెంకటేశ్‌నేత కోరారు. జడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.